# శతాయుష్మాన్‌భవ

— కె. వరలక్ష్మి



నేను నా ఆఫీసు రూమ్‌లోకి అడుగు పెట్టే సరికి, విజిటర్స్ కుర్చీలో కూర్చున్న ముసలాయన నెమ్మదిగా లేచి నిలబడ్డాడు. మళ్లీ ఏదో అనుమానం వచ్చి కూర్చేబోతూ "ఇదిగో అప్పారావ్! అమ్మగారొచ్చారా?" అన్నాడు శూన్యంలోకి చూస్తూ. ఆయన గొంతులో వార్ధక్యం తెచ్చిన కంపన.

నా వెనకే వచ్చిన అప్పారావ్ టేబుల్ మీది కాగితాలు సర్ది, వాటి మీద—ఎగిరి పోకుండా పేపర్ వెయిట్స్—"ఆఁ... వచ్చేరు" అన్నాడు ఫేన్ ఆన్ చేస్తూ. "ఈనెవరో సెవుటి మేళం, దానికి తోడు కళ్లంపడవండి, తెల్లారేతలికి ఎప్పుడొచ్చేడో గేటు దగ్గర రెడీగా ఉన్నాడు. మిమ్మల్ని సూత్తేనేకాని ఎల్లనంటన్నాడు" అన్నాడు వాడు పళ్లన్నీ కనపడేలా నవ్వుతూ.

ఉక్కకి తడిసి మరింత మాసినట్టు కనపడుతున్న ఆయన చొక్కానీ, భుజం మీది చిరుగులోంచి కనపడుతున్న ఎముకల గూడులాంటి వంగిన ఆయన దేహాన్నీ ఒక పక్క విరిగిపోయినా, నేనున్నానంటూ ముక్కు మీద నిలబడిన బి.సి.నాటి కళ్లజోడునీ మార్చి మార్చి చూస్తూ ఆయనెవరో గుర్తు చేసుకోవాలని శతథా ప్రయత్నించ సాగేను. లాభంలేదు. ఈయన్ని నేనెప్పుడూ చూసినట్టు లేదు. చూసుంటే ఈ సరికి గుర్తుకొచ్చేదే.

"అమ్మలూ! నువ్వు సుభద్రవి కదూ!" అన్నాడాయన నేనెటున్నానో ఊహించుకుని చూడ్డానికి ప్రయత్నిస్తూ.

"అవునండీ" అన్నాను నా జ్ఞాపక శక్తిని తిట్టుకుంటూ.

"గుర్తుకురాలే? మీ రంగా మేస్తారింటికి వచ్చేవాణ్ణి కానూ?"

ఓహో...

నవ్వుతూ.

"బాగున్నారా తాతగారూ" అన్నాను నేను ఏదో అడగాలి కాబట్టి.

"అయ్యో నా బాగు బుగ్గిగానూ... ఇంకేం బాగే తల్లీ, ఊరు పొమ్మంటోంది. కాడు రమ్మంటోంది" ఆయన గాజు కళ్లలో విషాదం దోబూచులాడింది.

అప్పారావు తెచ్చిన కాఫీని అందుకుని స్వయంగా ఆయన చేతికిస్తూ "ముందు కాఫీ తాగండి" అన్నాను.

వణికే చేతుల్తో కాఫీ కప్పు అందుకుంటూ "ఆడపిల్లవైనా బాగా చదువుకుని వృద్ధిలోకొచ్చావ్. చాలా సంతోషమమ్మా!" అన్నాడాయన. అప్పట్లో ఈయన మడిలేకుండా ఇచ్చిన కాఫీ ముట్టేవాడుకాదు. కాఫీతాగడం ముగిసాక అడిగేను "ఏం పనిమీద వచ్చారిలా?". దానికి జవాబుగా ఆయన కుర్చీ పక్కన పెట్టుకున్న మాసిపోయిన చేతి సంచిని తీసి, దాన్లోంచి తడిమి తడిమి కాయితాల కట్టల్ని బైటికి లాగసాగేడు.

ఆ కాగితాల్ని చూసి నేను అవాక్కయ్యాను.

ఇదే సంచి, ఇవే కాయితాలు—ఈయన రంగా మేస్టారింటికి కూడా తెచ్చేవాడు. కాకపోతే అప్పుడివి ఇంతగా నలిగిపోయి, చిరిగిపోయి లేవు.

ఆ కాయితాల్లో ఏముంటుందో నాకు తెలుసు.

"మన శ్యామ శాస్త్రి మాస్టారికి మన ఊళ్లో సన్మానం జరపాలనీ, వసూలైన మొత్తాన్ని బేంకులో వేసి, దాని మీద వచ్చే వడ్డీని స్కూలు ఫస్టు వచ్చిన విద్యార్థికివ్వాలనీ ఒక నిర్ణయం జరిగింది. మాస్టారి విద్యార్థులంతా తమ తమ శక్తిమేరకు డబ్బు పంపించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యమని కోరుతున్నాము.

ఇట్లు
కమిటీ మెంబర్స్

రంగా మాస్టారి పేరు కమిటీ మెంబర్స్ అన్న చోట ముందుంటుంది. మిగిలిన నలుగురి పేర్లూ గుర్తులేవు. వాళ్లంతా ఇప్పటికింకా ఉన్నారో లేరో!

ఆ కరపత్రం ఇంతగా గుర్తుండి పోవడానికి కారణం ఉంది. ఈ శ్యామశాస్త్రిగారు రంగా మాస్టారింటికి వచ్చినప్పుడల్లా ప్రైవేట్లో పిల్లలందరం తలా ఒక పేపరూ అడిగి తీసుకుని, ఆయన వెళ్లిపోయాక వరసపెట్టి పైకి చదువుతూ నవ్వుకునే వాళ్లం. ప్రతిసారీ మా మాస్టారు మందలించేవరకూ ఆ ప్రహసనం అలా సాగాల్సిందే.

అప్పట్లో ఈయన, తన దగ్గర చదువున్న వాళ్ల చిరునామాలు సేకరిస్తూ ఎక్కడెక్కడో తిరుగుతూ ఉండేవాడు


ఇప్పటికి స్ఫురించింది. ఈయన శ్యామశాస్త్రిగారు. వయసు ఈయనలో చాలా మార్పు తెచ్చింది.

"మీరా తాతగారూ, నమస్కారం. క్షమించండి, గుర్తు పట్టలేకపోయాను" అన్నాను లేచి దగ్గరకు వెళ్తూ. నా పలకరింపు విని అప్పారావు కాఫీ కోసం పరుగెత్తేడు.

ఈయనింకా బతికున్నాడంటే ఆశ్చర్యమే. మా రంగా మాస్టారికి విద్య నేర్పిన గురువీయన. ఆయన హైస్కూల్లో చదివే రోజుల్లోనే రిటైరయ్యాడుఈ మాస్టారు. పదిహేనేళ్ల క్రితం నేను హైస్కూలు స్టూడెంటుగా ఉండగా రంగా మాస్టారింటికి ట్యూషన్‌కి వెళ్లేదాన్ని. అప్పటికే రంగా మాస్టారికి నలభైఏళ్లు పైమాట. హార్ట్ ఎటాక్ వచ్చి ఈ మధ్యే పోయారాయన. ఈ ముసలాయనకి సహస్ర మాసాలు ఎప్పుడో దాటి ఉండచ్చు. గుండు చేయించుకున్నాడో, ఊడిపోయిందో కాని నెత్తిమీద ఒక్క వెంట్రుక లేదు. నోట్లో ఒక్క పన్ను కూడా ఉన్నట్టు లేదు.

"గుర్తుకొచ్చానా అమ్మడూ!" అన్నాడాయన తృప్తిగా

బతకలేక బడిపంతులు' అని నలుగురూ అనుకుంటున్నా, ఎందరో విద్యార్థుల భావిజీవితాలకు మంచి పునాది వేసే వ్యక్తిగా ప్రతి ఉపాధ్యాయుడూ తన బాధ్యతా నిర్వహణను ఉన్నతంగా భావిస్తూనే వుంటాడు. తను ఉన్నచోటనేవున్నా తన విద్యార్థి సాధించిన విజయాలు తన విజయాలుగా భావించి మురిసిపోతుంటాడు. కానీ ఎందరో జీవితాలకు అర్థాన్ని కల్పించే ఆ బడిపంతుళ్ళ జీవితాలు ఎలా వున్నాయి? వారి ఆశలు, ఆశయాలు ఏమిటి? చివరి దశలో వాళ్ళు ఏ పరిస్థితుల్లో వున్నారు? అనే విషయాలు ఇవాళ ఎంతమంది పట్టించుకుంటున్నారు? 'గురుబ్రహ్మ' అనబడే ఆ మహనీయమైన వ్యక్తిపట్ల సమాజానికి వుండవలసిన బాధ్యత ఏమిటి?



ఆ ఊరికి వస్తూనే సంచి తెచ్చి మాస్టారింట్లో పడేసి "రంగా! భోజనానికి కొచ్చేస్తాను. మడి కట్టుకుని వండమను మీయావిణ్ని" అని చక్కాపోయేవాడు ఊళ్లోకి.

అప్పటికే వంట ముగించుకున్న ఆవిడ మళ్లీ నూతి చప్టా మీదికి పోయి రెండు చేదల నీళ్లు నెత్తి మీద గుమ్మరించుకుని తడి చీరతో నీళ్లోడుకుంటూ కుంపటి అంటించేది.

అన్నం, పులుసు చల్లారితే పని కొచ్చేవి కావీయనకి. ఏ ఝాముకొస్తాడో పదార్థాలన్నీ వేడి చెయ్యాల్సి వస్తుందని కుంపట్లో రెండు నిప్పుల్ని ఆరిపోనీకుండా చూసుకునేవారావిడ. రాత్రికి కూరలన్నీ మళ్లీ వండాల్సిందే. మిగులు తగులు తినడాయన.

పిల్లల్తో గుట్టుగా సంసారం లాక్కొస్తున్న ఆవిడకి ఈయనొచ్చాడంటే మతిపోయినట్లయ్యేది. కాని, ఉత్తమ ఇల్లాలు కాబట్టి ఎప్పుడూ విసుక్కోకుండా సొంత మావ గారికి చేసి పెట్టినట్టు పెట్టేది. రంగా మాస్టారు జా॰గా చూసేవారావిణ్ని.

సొంత మావగారినైనా అలా చూడరని మా అత్తయ్యింట్లో చూసేను నేను. కొడుక్కి పదెకరాల మాగాణి సంపాదించి ఇచ్చిన మావగార్ని ముసలితనంలో మా అత్తయ్య విసుక్కుని, కసురుకుని నానా పాట్లు పెట్టేది.

"ఆ శ్యామశాస్త్రికేం రోగం, వచ్చి ఇలా అందరిళ్లమీదా పడతాడు? పెద్ద కొడుకు అక్కడెక్కడో స్కూళ్ల ఇనస్పెక్టరట. రెండోకొడుకు స్టేషను మేస్టరు. ఆ కోడళ్లు వడ్డాణాలూ, వరసగొలుసులూ వేసుకు తిరుగుతారు. ఈయన చూడబోతే ఇలా... ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఈ ముసలాడు వాళ్లని మళ్లనీ, తళ్లనీ వేయించుకు తింటాడు. ఈ రోజుల్లో ఎవరికి కుదురుతాయీ అవన్నీ?" అంటూ మా అత్తయ్యే ఒకరోజు స్వగతంలో శ్యామశాస్త్రి కథ చెప్పేసింది.

ఈయనకో కూతురుండేదట. పెళ్లి చేస్తే కట్నమివ్వాలని ఆ పిల్లకి ముప్పయ్యేళ్లొచ్చేవరకూ పెళ్లి మాటెత్తకుండా ఊరుకున్నాడట. చివరికి బంధువుల బలవంతం మీద భార్య వదిలేసి పోయిన ఒక తెలుగు పండితుడికిచ్చి ఆ పిల్లని కట్నంలేకుండా ముడిపెట్టేసేడట. ఈ విషయం తెలిసి అతగాడి మొదటి పెళ్లాం తిరిగొచ్చి ఈమెని తన్ని తరిమేసిందట. ఉద్యోగం ఊడుతుందనే భయంతో ఆ తెలుగుపండితుడు కుక్కిన పేనల్లే ఊరుకున్నాడట. దారీ తెన్నూ తెలీక ఆ అమ్మాయి తండ్రి దగ్గర కొస్తే ఈయన ఆమెని ఆదరించడం పోయి, చెడామడా తిట్టి, 'తెలివుంటే పోయి ఆ మొగుడి దగ్గరేపడి ఉండమ'ని తరిమేశాడట. ఆత్మహత్య చేసుకోబోయిన ఆమెని ఎవరో పుణ్యాత్ములు ఆదరించి తమతో తీసుకెళ్లారట. ఆరో తరగతి మాత్రమే చదువుకున్న ఆమె రాజధానీ నగరానికి చేరుకుని ఏదో బట్టల కొట్లో సేల్స్ ఉమన్‌గా పని చేసి తన పొట్ట తను పోషించుకుంటోందట—ఈ సమాచారం కూడా మా అత్తయ్యే సేకరించిందప్పట్లో.

ఆ కాగితాల్ని చూస్తూ అలా ఉండిపోవడం చూసి కాబోలు "అమ్మగారూ! ఏంటండీ!" అని పలకరించేడు అప్పారావు.

వణికే చేతుల్తో పేర్ల లిస్టున్న కాయితాల్ని విడదీస్తూ "అమ్మలూ! ఇందులో నా దగ్గిర చదువుకున్న వాళ్ల పేర్లు, ఎడ్రసులూ కొన్ని వందలున్నాయి. కొందరు తండ్రులకీ, వాళ్ల కొడుకులకీ కూడా నేనే చదువు చెప్పేను. వీళ్లల్లో ఒక్కడు, ఒక్కడంటే ఒక్కడు కూడా పదిరూపాయలైనా పంపలేదు" అంటుంటే శ్యామశాస్త్రి గారి కంఠం గద్గదమైంది. కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి.

ఆ రోజుల్లో ఈ కరపత్రాలను ఎవరో ప్రెస్ ఉన్న స్టూడెంటు ఉచితంగా ప్రింటు చేసి ఇచ్చేడట. వీటిని అందరికీ పంపించే బాధ్యత రంగా మాస్టారి మీద పెట్టాడీయన. కాని, ఇన్ని వందలమందికి—పోస్టేజి భరిస్తూ వాటిని పంపించేంత ఆదాయం రంగా మాస్టారికి లేదని ఈయనకి తెలీదా? 'తన గురువు కోసం తానేమీ చెయ్యలేకపోతున్నానే' అని ఆయన ఎంతగా కుమిలిపోయేవారో ఈయన గమనించలేదా? తెలిసే తనని తను మోసం చేసుకుంటూ వచ్చేడా? ఇన్నేళ్ల తర్వాతింకా ఈ బడిపంతుల్ని ఆ విద్యార్థులు గుర్తుపెట్టుకుంటారని నిజంగా నమ్ముతున్నాడా ఈయన?

"నిజం చెప్తున్నా నమ్ము అమ్మలూ! ఆ మారుమూల ఊళ్లో అనామకపు బడిపంతులుగా బతుకు వెళ్లదీసేను. నాకు తెలిసిందీ, నేను వలచిందీ ఆ ఊరే. ఆ ఊరితో నా అనుబంధం నాకే అర్థం కానిది. నా తల్లినీ, నా భార్యనీ అదే నేలమీద మట్టి చేశాను. నేనూ అక్కడే మట్టిలో కలిసిపోతాను. కాని... కాని... నేను పోయినా ఆ బడిలో నాపేరు నిలిచిపోవాలి. ఏడాదికొకసారైనా ఏదో ఒక సందర్భంలో ఆ బడిలో నా పేరు తలుచుకోవాలి. ఇది నా తీరని కోరిక. ఇప్పటికెందర్నో అడిగేను. అవుననే వాళ్లు కొందరు, నా వెనక నవ్వే వాళ్లు కొందరు. కాని, నా కోరిక ఎవ్వరూ తీర్చలేదు. ఈ ఆశ తీరకుండానే రాలిపోతానేమో అనుకుంటూండగా నువ్విక్కడున్నట్టు తెలిసింది. నువ్వు నా దగ్గిర చదువుకున్న దానివి కాదు. అయినా, నాకీ సాయం చేసిపెట్టు తల్లీ! ఈ కాయితాలన్నీ ఆ ఎడ్రసులకి పంపించు." జీవం లేనట్లున్న చల్లని చేతుల్తో నా చేతుల్ని పట్టుకున్నాడాయన.

ఈ కోరికే ఈయన్నింతకాలం బతికించినట్లుంది.

"తాతగారూ! నాకో డౌటు. అప్పట్లో మీ రిటైర్మెంటు డబ్బుతో ఆ పని చెయ్యొచ్చు కదా!"

విషాదంగా నవ్వేడాయన.

"అప్పట్లో బడిపంతులి జీతం ఒక జీతమూ, పెన్షను పెన్షనూనా? బతకలేక బడిపంతులనే వాళ్లు. ఆ పెన్షను నాలుగు రాళ్లూ రావడానికి ఎన్ని పాట్లు పడ్డానో ఆ పరమాత్ముడికే ఎరుక. ఇకపోతే, నా కొడుకులు నా పాలిటి శత్రువులు. ఆ డబ్బు అందగానే 'ఇక మీద నిన్ను పోషించాల్సింది మేమే కదా' అంటూ గద్దల్లా తన్నుకు పోయారు."

ఇది వింటూంటే మనం చెవులతో వినే ప్రతి సంఘటనకీ బొమ్మా బొరుసూ ఉంటాయని నా కనిపించింది.

"అమ్మగారూ! ఇజిటర్సు శానామంది మీకోసం వెయిట్ చేస్తున్నారు" అంటున్నాడు అప్పారావు గొణుగుతూ. ఉద్యోగ రీత్యా బిజిసీటు నాది.

ఒక నిర్ణయానికొచ్చి "అలాగే తాతగారూ! మీరు చెప్పినట్టే చేస్తాను. మీ ఎడ్రస్ ఇచ్చి వెళ్లండి. పని ముగియగానే మీకు కబురు చేస్తాను." అన్నాను.

ఆ మాట వింటూనే నవ్వుతో ఆయన బోసి పెదవులు విచ్చుకున్నాయి

"శతాయుష్మాన్‌భవ—శతాయుష్మాన్‌భవ" రెండు చేతులెత్తి ఆశీర్వదించాడు.

ఆ సంచీలోని కాగితాలన్నిటితోబాటు తన ఎడ్రసు కూడా ఇచ్చి, అప్పారావు తోడురాగా బైటికి కదిలాడాయన.

దీర్ఘకాలం బ్రతకడం అదృష్టమోనోకాదో నాకు తెలియదు. ఈ శ్యామశాస్త్రిగార్ని చూస్తూంటే అది అదృష్టం కాకపోగా దురదృష్టమేమోనని అన్పిస్తోంది. ఆ దీవెన అందరికీ కాకపోయినా, కొందరికైనా శాపంగా పరిణమిస్తుంది కాబోలు! అందుకే ఆ దీవెన మాత్రం నాకొద్దనుకున్నాను.

వార్ధక్యంలో నా అనే వాళ్లులేక, కష్టానికి ఆదుకునే తోడులేక, స్వయంగా చెయ్యి కాల్చుకుంటూ, ఉన్ననాడు తింటూ లేనినాడు పస్తులుంటూ బ్రతుకును వెళ్లదీసుకు రావడం శాపం కాక మరేమిటి? వేదికలెక్కి ఉపన్యాసాలు దంచే రాజకీయ నాయకులకిలాంటి వాస్తవాలు దృష్టికి రావు.

'బ్రతుకొక్క ఆరిన వత్తి కొడిలా తలచి—మిథ్యలాక లచి పై కప్పు వంగి పడు పాడిల్లు పలె నిలిచి'(తిలక్) ఉన్న శ్యామశాస్త్రి గారి కోసం త్వరలో ఏదో ఒకటి

స్వయంగా చెయ్యాలనే నిర్ణయానికి వచ్చాను.

* * *

మరో వారంరోజుల్లో నా ఆఫీసులో జరూరు పనుల న్నీ ముగించుకున్నాను. మా కంపెనీ రూల్స్ ప్రకారం నాలుగు వేల కన్నా ఎక్కువ అప్పుగా శాంక్షన్ కాలేదు. నావెనకున్న బాధ్యతల వలన నేనింతవరకూ కూడబె ట్టిందేం లేకపోయింది.

నేనిలా వస్తున్నాను, ఆయన్ని సిద్ధంగా ఉండమని శ్యామశాస్త్రిగారికి టెలిగ్రాం ఇచ్చి బయలుదేరి వెళ్లేను.

నేరుగా హైస్కూలుకు చేరుకుని హెడ్మాష్టరుగారికి, స్టాఫ్‌కీ విషయం చెప్పాను. శ్యామశాస్త్రిగార్ని తెలిసిన వాళ్లెవరూ లేరు. అయినా, అందరూ ఉత్సాహంగా ముందుకొచ్చారు.

విద్యార్థుల సాయంతో ఏర్పాట్లన్నీ పూర్తి చేయించాను. కాని, ఊహించని వార్త నన్ను బాగా నిరుత్సాహ పరిచింది.

శ్యామశాస్త్రిగారి కోసం పంపిన కారులో మధ్య వయ స్కుడొకాయన వచ్చిదిగాడు.

టెలిగ్రాం అందిందట. ఎదురు చూస్తూ ఉంటామే మోనని కబురు చెప్పడానికి వచ్చాడట. వస్తూనే మొదలు పెట్టాడు—"చూడండి ఎంత పని చేసేడో ముసలాడు. వారం రోజులక్రితం ఎక్కడినుంచో గాలిలో తేలుతున్న ట్టు నడిచి వచ్చేడు. ఎందుకో ముఖం వెలిగిపోతోంది. తనలో తనే నవ్వుకుంటున్నాడు. అలా వచ్చి వచ్చి వంచపాళీగదిలో మూలనున్న తన మూటమీద తలవా ల్చేడు. ముఖం నవ్వుతూనే ఉంది. ఎప్పుడు ప్రాణం పోయిందో వివరం గమనించలా. దుష్ట నక్షత్రంలో చచ్చి మమ్మల్ని సాధించేడు. ఇల్లు ఖాళీ చెయ్యాల్సొచ్చింది.

"ఏఁవిటీ సన్మానం అని టెలిగ్రామిచ్చారు? ఆయన తాలూకు డబ్బేమైనా ఉంటే నాకే చెందుతుంది. ఎందు కంటే దూరపు బంధుత్వాన్ని పురస్కరించుకుని పోయే ముందంతా నా ఇంట్లోనే ఉన్నాడు. కొడుకులు బాగానే వదిలించుకున్నారు." అని కూడా అన్నాడు.

ఎందుకో నాకు దుఃఖం కానీ, ఆశ్చర్యం కానీ కలగ లేదు. అలాంటి మనిషి అలా మాట్లాడకపోతేనే ఆశ్చర్య పడాలి.


"అలాంటిదేం లేదు లెండి" అంటూ అందరూ కలిసి ఆయన్ని పంపించేశారు. అనుమానంగా చూస్తూ నే నిష్క్రమించాడాయన.

సభాకార్యక్రమం కొనసాగించాము. శ్యామశాస్త్రిగారి ఆత్మశాంతికి ఐదు నిముషాలు మౌనం పాటించాము. తెలీని వాళ్లు కూడా ఆయన గొప్పతనాన్ని పొగిడారు స్టేజిమీద.

నేను తెచ్చిన డబ్బు బేంకులో వేశాను శాస్త్రిగారి పేర్న. దాని మీద వచ్చే వడ్డీ శాస్త్రిగారికోరిక మేరకు ప్రతిఏటా ఆ స్కూల్లో ఫస్టన వచ్చే విద్యార్థి కివ్వాలనీ, ఆ ఫండ్ మాత్రం ఎల్లకాలం అలాగే ఉండాలనీ బేంకులో నమోదైంది.

తిరిగి వస్తూ అలసటగా సీట్లో వెనక్కి చేరబడ్డాను. కాంతి తరిగిన సూర్యుడు పశ్చిమాద్రి వెనక్కి నిష్క్ర మించబోతున్నాడు. చెట్ల ఆకుల నీడల వెనక ఎక్కడో ఒక వృద్ధ మహిషం దీనంగా అరుస్తోంది.

ఒక జీవి తుది కోరిక తీర్చే అవకాశం కలిగించిన నా ఉద్యోగానికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. □




## 'రవళి'

### (కవితా సంపుటి)

రచన : యం. విద్యాధరి; తెలుగు సాహితి (E. A. 124/2 టాగోర్‌గార్డెన్ న్యూఢిల్లీ - 110 027) సభ్యులకోసం ప్రత్యేక ప్రచురణ, వెల రూ. 5 పుటలు : 46.

ఇందులో హరివిల్లు, ఉగాది, కదలి తల్లి, పుణ్యస్త్రీ, తులసి తీర్థం, నాకల నిజమైతే, కులం, సహనం మొ॥ శీర్షికలతో మొత్తం ఇరవైరెండు చిన్న చిన్న వచన కవితలున్నాయి.

దేశంలో నలుమూలలా రోజు రోజుకీ పెల్లుబికి పోతున్న అన్యాయాల్ని, అక్రమాల్ని అవినీతి కలాపాల్ని విద్రోహక చర్యల్ని దుండగుల దౌర్జన్యాల్ని అందుకు బలైపోతున్న అమాయక ప్రజల్ని వారి మనోభావాల్ని పేదల అగచాట్లనీ కవయిత్రి పొందికైన శైలిలో అందరికీ అర్థమయ్యే తీరున తేటమాటల్లో సూటిగా వ్యక్తం చేశారు.

'రవళి—అది వాగ్దేవి పాదమంజీర రవళి'—అనీ,
పఠితల బుద్ధికి పుష్టినిచ్చే
మనిషి మనసుకు హాయినిచ్చే —
ప్రయోజనకరమైన సాహిత్యాన్ని ప్రజలకు విరివిగా అందించాలన్న కవయిత్రి మధుర సంకల్పం రవళిస్తుంది.

ప్రతి కవిత నిజాన్ని బాహాటంగా చాటిచెప్పే రసభావగుళిక అనిపిస్తుంది.

మచ్చుకు కొన్ని :

"స్వతంత్రమొచ్చి ఇన్నేళ్ళయినా
ఎన్నిసార్లు ఎన్నికలయినా
అప్పటికీ — ఇప్పటికీ
మారలేదు మనతత్వం....
మన తత్వానికి —
కాదు ఫిట్టు ప్రజాతంత్రం" అనడంలో జనం లోని బుద్ధిమాంద్యం తొంగిచూస్తుంది.

'కావాలి ప్రజలు కాంతాలు'—అన్న కవితలో ఏభై యేళ్ళు పైబడ్డ సీతాపతి నెల్రోజులు లీవు శాంక్షను చేయించుకుని ఊళ్ళు చూడాలన్న ఉత్సా హాన్ని భార్య కాంతంతో ప్రకటించడం, ఆవిడ "ఉరుములు లేని ఈ పిడుగేమిటి? తలకు మించున్న సమస్యల్లో ఈ ప్రయాణమెట్లా పెట్టు కున్నారసలు" అంటూ సహజధోరణిలో దండకం ఏకరువు పెట్టడమూ, సమాధానంగా సీతాపతి కాంతంతో—

"రోజూ వార్తాపత్రిక చదువు ఆసాంతం
అస్సాం పంజాబు సమస్యలూ
మత కలహాలూ
కేంద్ర - రాష్ట్రాల సుద్దులూ
ఆహార విద్యుత్ నీటి కొరతలూ
మరోవైపు ముంచేస్తున్న వరదలూ
మన ప్రధాని యూరప్ పర్యటనలూ" అంటూ వెగటూ వ్యంగ్యం ధ్వనింపజేయడం....

"ఎట్లాగూ తీర్చలేం మన మీ సమస్యలు
ఎప్పుడూ ఉండేవే కంతానికి ఈ ఉచ్చులు" అంటూ ఉసూరు మనడం....ఇలా సాగిపోయే ఆ దంపతుల సంభాషణలో ఎంతటి చేదు నిజాలు బుజువవుతాయో....చూడగలం.

'నా కల నిజమైతే'—అన్న కవితలో
"దేశం - దేవాలయం
తోటి మనిషే దేవుడు
బాధ్యతా నిర్వహణ
నిత్య దేవతార్చన"—అన్న ఆశయం
అందరికీ - ఒకే నీతి
ఒకే న్యాయం - ఒకే హక్కు
ఒకే మతం....ఉండాలన్న ఆకాంక్ష స్పంది స్తాయి .... ఈ తీరున ముచ్చటైన పేరు గల్గిన 'రవళి' పాఠకులకు సంతృప్తినివ్వగలదనడంలో సందేహంలేదు. తెలుగు సాహితి (ఢిల్లీ) వారి కృషి ప్రశంసనీయం.

—'మమత'